చౌదరిగూడలో రేషన్‌కార్డుల పంపిణీ

పోచారం: మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు మాజీ వార్డు సభ్యుడు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రడమల్ల భోజిరెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చౌదరిగూడలో మొత్తం 14 మందికి రేషన్‌కార్డులు మంజూరైనట్లు చెప్పారు. కాంగ్రెస్ నేతలు పసులాది నర్సింగ్ రావు, కేశపాపుల వినోద్‌కుమార్, సుధాకర్, బండ్లగూడెం అనిల్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ తొలగింపు

పోచారం: చౌదరిగూడలోని సర్వే నెంబర్ 715లో రెండెకరాల విస్తీర్ణంలో 40 ప్లాట్లతో ఏర్పాటు చేసిన ఓ వెంచర్‌లోకి వెళ్లే దారికి అడ్డుగా కొందరు వ్యక్తులు ప్రహరీని నిర్మించారు. ఈ సమస్యపై హైడ్రా అధికారులకు ప్లాట్ల యజమానులు ఫిర్యాదు చేయగా.. వారు మంగళవారం కూల్చివేతలు చేపట్టి, ప్రహరీని తొలగించారు.

మదర్ థెరిసాకు ఘన నివాళి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి జ్ఞానాపూర్‌లో మదర్ థెరిసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి మరిలమ్మ, మాజీ కౌన్సిలర్ అంతొనమ్మ ఫిలిప్స్ ఆధ్వర్యంలో స్థానిక చర్చ్‌లో నిర్వహించిన వేడుకల్లో థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రమణారెడ్డి, నాయకులు గోపాల్, హరిశంకర్, రాజు, జోసెఫ్, ప్రభాకర్, రమేష్ పాల్గొన్నారు.

ఆటిజం, వృద్ధాశ్రమాలకు అనుమతి తప్పనిసరి

జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఆటిజం సెంటర్లు, వృద్ధాశ్రమాలను నిర్వహించడానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సంక్షేమశాఖ అధికారిణి శారద తెలిపారు. నూతనంగా నిర్వహించాలనుకున్న ఆటిజం సెంటర్లు, ఓల్డ్ ఏజ్ హోం కేంద్రాల నిర్వాహకులను తక్షణమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహించే వాటిపై నియమనిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తి వివరాలకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డీఈఓ విజయకుమారి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ–ప్రైమరీ సెక్షన్లలో 'ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్' 'ఆయా' ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ప్రకటించారు. ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు కనీస అర్హత ఇంటర్ లేదా సమానమైన అర్హతను కలిగి ఉండాలన్నారు. శిశు విద్య లేదా ప్రైమరీ టీచింగ్‌లో అర్హత కలిగిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. 18 నుంచి 44 ఏళ్లు ఉండాలన్నారు.

- ఆయా పోస్టులకు కనీస అర్హత 7వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని డీఈఓ తెలిపారు. 18 నుంచి 44 ఏళ్లు ఉండాలని వివరించారు. ఎంపికైన వారికి గౌరవ వేతనం ఒక విద్యా సంవత్సరానికి 10 నెలలు మాత్రమే చెల్లించబడుతుందన్నారు. జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన ప్రీ–ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్‌కు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వబడుతుందని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు పదోన్నతి

జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో ఉపాధ్యాయులు పదోన్నతి ప్రక్రియలో భాగంగా మంగళవారం ఎస్‌జీటీ దాని తత్సమానమైన కేటగిరీలకు చెందిన 75 మంది ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులు కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల వివరాలను అధికార గ్రూపు నందు పొందుపరిచినట్లు వివరించారు.

ఆశావర్కర్లకు కనీస వేతనం ప్రకటించాలి

కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ఆందోళన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ప్రకటించాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి డిమాండ్ చేశారు. మంగళవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రేవతి కల్యాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల ముందు ఆశావర్కర్లకు ఇచ్చిన హామీ ప్రకారం ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అందజేయాలని కోరారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీని వెంటనే చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, కోమలత, వాసంతి ,అనిత, సబియా, యాదమ్మ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తాకు వినతిపత్రం అందజేశారు.

మట్టి గణపతి మహా శ్రేష్ఠం !

ముక్కోటి దేవతల్లో తొలిపూజలు అందుకొనే ఆది దేవుడు విఘ్ననాయకుడిని భక్తిశ్రద్ధలతో కొలుచుకునే వినాయక నవరాత్రులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. యువత ఇప్పటికే వినాయక మండపాలను అందంగా అలంకరించి ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ పర్యావరణానికి హాని కలిగించని మట్టి విగ్రహాలను పూజించి తమ భక్తిని చాటుకోవాలని పర్యావరణ ప్రేమికులు పిలుపునిస్తున్నారు.
– మేడ్చల్‌రూరల్

మట్టి గణనాథుడినే పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం

పిలుపునిచ్చిన పర్యావరణ ప్రేమికులు


ఎమ్మెల్యే మల్లారెడ్డికి విత్తన గణపతిని అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేత శ్రీకాంత్‌రెడ్డి

పీఓపీతో అనర్థాలెన్నో..

వినాయక చవితి వచ్చిందంటే చాలు చిన్న, పెద్ద తేడా లేకుండా వినాయకచవితి సంబరాల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొంటారు. యువజన సంఘాలు ఒకరిని మించి మరొకరు భారీ విగ్రహాలను నెలకొల్పాలని భావిస్తున్నారు. దీనికి మట్టి విగ్రహాలు ధృడంగా ఉండవని, తాము అనుకున్న విధంగా అందంగా విగ్రహాలు ఉండవని భావిస్తున్న యువత ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నెలకొల్పుతున్నారు. కానీ పీఓపీతో తయారు చేసిన విగ్రహాలతో ఎన్నో అనర్థాలు కలుగుతాయని పలువురు వాదిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగదని చెబుతున్నారు.

హానికర రంగుల వాడకం..

విగ్రహం ధృడంగా ఉండేందుకు ఉపయోగించే క్లాడ్మియం చాలా ప్రమాదకర రసాయన పదార్థం. ఈ రసాయనంతో మనిషి మెదడుపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. పీఓపీ విగ్రహాలను చెరువులలో నిమజ్జనం చేస్తే అవి నీటిలో కరిగేందుకు చాలా రోజుల సమయం పడుతుంది. వాటి నుండి వెలువడే రసాయనాలతో చెరువులో ఉండే జీవులకు ప్రమాదం వాటిల్లుతుంది. ఆ నీటిని మనుషులు వాడితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మొత్తానికి పీఓపీ విగ్రహాలతో ఎన్నో రకాలుగా పర్యావరణ కాలుష్యం అవుతుంది.

అన్నింటికీ మేలు...

మట్టి వినాయకుడి విగ్రహాల ఏర్పాటుతో అన్ని రకాలుగా మేలు జరుగుతుంది. విగ్రహాల తయారీకి బంకమట్టి, కర్రలు, వరిగడ్డి వాడటంతో పాటు హానికర రసాయనాలు ఉపయోగించకుండా తయారు చేస్తారు. నిమజ్జనం తర్వాత ఇవి వెంటనే నీటిలో కరిగిపోతాయి. నీటిలో కరిగిన తర్వాత ఎరువుగా మారుతాయి. నీటిలో ఉండే జలాచరాలకు ఎలాంటి ముప్పు ఉండదు.

విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల అవగాహన..

వినాయక చవితి పండగను పురస్కరించుకుని మట్టి విగ్రహాలను నెలకొల్పాలంటూ.. పలు ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంజినీరింగ్ కళాశాలలు, పాఠశాలల్లో ప్రతీ ఏటా విద్యార్థులతో మట్టి వినాయకుడి విగ్రహాలను తయారు చేయించి వాటిని తమ ఇళ్లలో నెలకొల్పాలని సూచిస్తున్నారు.

పలుచోట్ల ఉచితంగా పంపిణీ..

స్వచ్ఛంద సంస్థలు మట్టి గణనాథులను పలుచోట్ల ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. పీఓపీ విగ్రహాల ఏర్పాటు వల్ల కలిగే పర్యావరణ కాలుష్యం, అనర్థాలను వివరిస్తున్నారు. మేడ్చల్ బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాయకులకు విత్తన గణపతులు అందజేసి పర్యావరణాన్ని కాపాడాలని కోరుతున్నారు.


మట్టి గణపయ్యను తయారుచేస్తున్న శిల్పి (ఫైల్)

మట్టి గణపతినే పూజించాలి



మట్టి వినాయకులను పూజిస్తేనే మానవాళికి మేలు జరుగుతుంది. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలనే నెలకొల్పాలి. శాస్త్రం కూడా మట్టి విగ్రహాలనే పూజించాలని చెబుతోంది. సమస్త చరాచర జగత్తు అంతా మట్టి నుంచే ఉద్భవిస్తుంది. 7న చంద్ర గ్రహణం ఉన్నందున మండపాల్లో నవరాత్రులు పూజించి నిమజ్జనం చేయడం ఎంతో మేలు.
– వెంకటేశశర్మ, పురోహితుడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నవరాత్రుల్లో యువత ఉత్సాహంగా పాల్గొని మండపాల్లో గణనాథుడిని నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజించడం సంతోషకరం. కానీ పర్యావరణాన్ని పరిరక్షించాల్సి బాధ్యత కూడా యువత చేతుల్లోనే ఉంది. మట్టి విగ్రహాలను నెలకొల్పి పర్యావరణాన్ని కాపాడాలి. భవిష్యత్ తరాలకు యువత ఆదర్శంగా నిలవాలి.
– సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్, మేడ్చల్

పర్యావరణ హితం కోసమే...

పర్యావరణాన్ని పరిరక్షించడానికే మట్టి వినాయకులను తయారు చేస్తున్నాం. ఎలాంటి రసాయనాలు లేకుండా బంకమట్టి, వెదురుబొంగులు, కర్రలు, గడ్డితో విగ్రహాలను తయారు చేస్తున్నాం. గత ఐదేళ్ల నుంచి ఈ మట్టి వినాయకులను తయారు చేస్తున్నాం. ప్రస్తుతం మట్టి వినాయకులకు విశేష ఆదరణ లభిస్తోంది.
– చంద్రమోహన్, మట్టి గణపతి తయారీదారు

మట్టి గణపతిని పూజిస్తే పర్యావరణానికి మేలు


అత్వెల్లి స్కూల్‌లో మట్టి గణపతులను తయారుచేస్తున్న విద్యార్థులు

మేడ్చల్: వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులు కోరారు. అత్వెల్లిలోని ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేసి పంపిణీ చేశారు. మట్టి సేకరించి వాటికి సహజరంగులను వేసి అందంగా వినాయకుడి ప్రతిమలు తయారు చేశారు. మట్టి వినాయకుడి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. ఉపాధ్యాయులు నవీన్, వసీం, మంజుల, రంగారావు, రాంబాబు, స్వరూపరాణి, ప్రభాకర్, విజయలక్ష్మి, సోని తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌జీఎఫ్' జోనల్ స్థాయి క్రికెట్ సెలక్షన్స్

ఘట్‌కేసర్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఘట్‌కేసర్ జోనల్ లెవల్ క్రికెట్ సెలక్షన్స్ 29న నిర్వహించనున్నట్లు జోనల్ కార్యదర్శి, పీడీ శ్రీరాములు తెలిపారు. అండర్– 14, 17 విభాగాల్లో ఎంపిక జరుగుతాయని, పాల్గొనాలనుకునే వారు జనవరి 1, 2012 తర్వాత జన్మించి ఉండాలని, అండర్ –17లో పాల్గొననున్న విద్యార్థులు జనవరి 1, 2009 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. ఎంపికకు వచ్చే విద్యార్థులు స్కూల్ బోనాఫైడ్ పెన్ నెంబర్, ఆధార్ జిరాక్స్‌తో శుక్రవారం ఉదయం 9 గంటలకు వెంకటాపూర్ బ్యాట్ బాల్ క్రికెట్ గ్రౌండ్‌లో రిపోర్టు చేయాలని ప్రకటించారు. అదనపు సమాచారం కోసం 9291303090.

అధికారులు అందుబాటులో ఉండాలి


నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఏసీపీ చక్రపాణి

అడిషనల్ డీసీపీ వెంకటరమణ

ఘట్‌కేసర్: ఏదులాబాద్ వినాయకసాగర్ (శ్రీ లక్ష్మీ నారాయణ చెరువు)లో నిమజ్జనం పూర్తయ్యేంత వరకు సంబంధిత అధికారులు వారి వారి విధుల్లో అందుబాటులో ఉండాలని రాచకొండ కమిషనరేట్ మల్కాజిగిరి జోన్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణితో కలిసి సంబంధితశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏదులాబాద్ వినాయకసాగర్ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మల్కాజిగిరి జోన్ ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్లు బాలస్వామి, రాజువర్మ, డీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, స్థానిక మున్సిపల్ కమిషనర్ రాజేష్, పోచారం కమిషనర్ నిత్యానంద్, ట్రాఫిక్ ఎస్సై విజయకృష్ణ, ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, శేఖర్, నాయబ్ తహసీల్దార్ రాజేందర్, ఇరిగేషన్ ఏఈ పరమేష్, విద్యుత్ ఏఈ యశ్వంత్‌కుమార్, కుమార్‌ముదిరాజ్, సంబంధితశాఖ అధికారులు పాల్గొన్నారు.

మట్టి వినాయకులను పూజించాలి

కలెక్టర్ మను చౌదరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల జల వనరులు కాలుష్యం అవుతాయని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో మట్టి వినాయకుల విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. విఘ్నాలు, సమస్యలు తొలగించి సకల శ్రేయస్సులు చేకూర్చాలని కోరుతూ.. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ మనుచౌదరి వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రాంతీయ కార్యాలయం వారు రూపకల్పన చేసిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. మట్టి గణపతి ప్రతిమలను కలెక్టరేట్ సిబ్బంది, ప్రజలకు కలెక్టర్ పంపిణీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్, సహాయక పర్యావరణ శాస్త్రవేత్త లింగయ్య, ప్రాజెక్ట్ అనలిస్ట్ రాకేష్ పాల్గొన్నారు.

విద్యారంగానికి నిధులు మంజూరు చేయాలి


మేడ్చల్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ఏబీవీపీ నాయకులు


మేడ్చల్: యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించే విద్యావ్యవస్థపై ప్రభుత్వం ఎందుకింత నిర్లక్ష్యం వహిస్తుందో అర్థం కావడం లేదని ఏబీవీపీ నాయకులు అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుపడకుండా వెంటనే తగిన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. ఏబీవీపీ నాయకులు మంగళవారం పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. విద్యాశాఖకు మంత్రి లేకుండా పాలన సాగుతుందని, నిధులు లేక విద్యాసంస్థల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని వాపోయారు. మేడ్చల్‌లో ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పోరాటాలు చేస్తున్నా.. కనీసం పాలకులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్ నరేష్, నాయకులు హర్షిత్, పార్థసారధి, గౌతమ్, మనోజ్, సాయి విజయ వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి


హరిబాబు (ఫైల్)

శామీర్‌పేట్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ, ఆద్రాస్‌పల్లి హరిబాబు (28), వృత్తిరిత్యా కూలీ. కాగా మంగళవారం సాయంత్రం తూంకుంట నుంచి పోతాయిపల్లి స్కూటీపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న పోతాయిపల్లి చెరువు వద్ద స్కూటీని నిలిపి మూత్రవిసర్జన చేస్తుండగా.. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడ్డాడు. స్కూటీని గమనించి స్థానికులు దగ్గరకు వెళ్లి చూడగా నీటిపై హరిబాబు తేలియాడుతున్నాడు. సమాచారం అందుకున్న శామీర్‌పేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా 5 నెలల క్రితమే భార్య, ఇప్పుడు కుమారుడు ప్రమాదంలో మరణించడంతో తండ్రి కన్నీటి పర్యంతమయ్యాడు.

కల్తీ మద్యానికి బ్రాండెడ్ లేబుల్ !


నకిలీ లేబుల్స్ ముద్రిస్తున్న మెషిన్

పోచారం: కుషాయిగూడలో అక్రమంగా మద్యం లేబుల్స్ ముద్రించి కల్తీ లిక్కర్ బాటిళ్లు తయారు చేసే ముఠాకు సరఫరా చేస్తున్న వ్యక్తి ఎక్సైజ్ పోలీసులకు మంగళవారం చిక్కాడు. హుజూర్‌నగర్‌లో దొరికిన నకిలీ మద్యంపై పోలీసులు విచారణ చేపట్టగా.. కేసుకు సంబంధించిన మూలాలు కుషాయిగూడలో ఉన్నట్లు గుర్తించారు.

వ్యర్థ జలాలతో అవస్థలు !

ఆందోళనకు దిగిన తండావాసులు

శామీర్‌పేట్: కంపెనీ వ్యర్థాలతో తండావాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో కంపెనీ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని నాగిశెట్టిపల్లి తండాలో ఉన్న ఓ డైరీ కంపెనీ నుంచి రోడ్డు పక్కన వ్యర్థ జలాలను వదలడంతో భరించలేని దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నాగిశెట్టిపల్లి తండావాసులు కంపెని ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. కంపెనీ వ్యర్థ జలాలు ప్రహరీ పక్క నుంచి వదలివేస్తున్నారని, దీంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ నుంచి వదులుతున్న రసాయన వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితమైపోతున్నాయని ఆరోపించారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించి కంపెనీపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పండుగకు పట్టణం ముస్తాబు

మార్కెట్‌లో పండగ సందడి



పండగ కొనుగోళ్లతో సందడిగా మేడ్చల్ మార్కెట్

మేడ్చల్: వినాయక చవితి సందర్భంగా మేడ్చల్ పట్టణం ముస్తాబైంది. కాలనీలలో అందంగా రకరకాల రూపంలో షెడ్లు నిర్మాణం చేసి గణనాథుడిని ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రుల పాటు సాగే పూజల కోసం వీధుల్లో షెడ్లు ఏర్పాటు చేయగా.. మండపాలు ఉన్న రోడ్లలో విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- మేడ్చల్ మార్కెట్‌లో మంగళవారం పండగ సందడి నెలకొంది. వినాయక విగ్రహాల అమ్మకాలు, పండగ సందర్భంగా దేవుడికి పెట్టి పూజించే పువ్వు, పత్రి ఆకులు, పండ్లు అమ్మకాలతో మార్కెట్ సందడిగా కనిపించింది. వినాయక చవితికి చింతకాయ , తుమ్మి కూర ,వివిధ రకాల పత్రాలు, వస్తువులు మార్కెట్‌లో కనిపించాయి. వినాయక విగ్రహాల ధరలు, పూలు, పండ్ల రేట్లు అధికమయ్యాయి. మేడ్చల్ మార్కెట్ రోడ్లు పండగ కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది.

స్థానిక సమస్యలపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

కీసర: కీసర మండల పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం పార్టీ కీసర మండల నాయకులు బంగారు నర్సింగ్‌రావు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుందన్‌పల్లిలో సర్వే నెంబర్–171 పెద్ద నాలా పక్కన ఉన్న 20 గుంటల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. యాద్గార్‌పల్లిలో 30 గుంటల స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. శ్రీరామలింగేశ్వర కాలనీలోని వికలాంగుల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలకు అసౌకర్యం కల్పించొద్దు !

- సమీకృత సబ్ రిజిస్టర్ కార్యాలయాల ప్రతిపాదనలపై..
- పునరాలోచించాలన్న బీజేపీ



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం నూతనంగా ప్రతిపాదించిన సమీకృత సబ్ రిజిస్టర్ కార్యాలయాలు ప్రజలకు అసౌకర్యంగా ఉంటాయని, ఆ ప్రతిపాదనపై పునరాలోచన చేసి, ప్రస్తుతం ఉన్న చోటే అన్ని సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించాలని బీజేపీ మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి రూరల్, అర్బన్ జిల్లా కమిటీల అధ్యక్షులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం 'ఇన్‌స్పెక్టర్ జనరల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్' అధికారికి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న చోటే సకల సౌకర్యాలతో నూతన భవనాలను నిర్మించడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

- ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలలోని 39 సబ్ రిజిస్టర్ కార్యాలయాలను 11కు కుదించడం ఏ మాత్రం సబబు కాదన్నారు. నగరంలో కూడా వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాలను కుదించడం సరికాదన్నారు.
- ప్రతి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రోజుకు 100 మందికి పైగా ప్రజలు వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలైన తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, కూర్చోవడానికి కూడా వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు సైతం తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.
- 3 నుంచి 4 కార్యాలయాలను ఒకే చోటుకి తరలిస్తే కనీసం 500 నుంచి 1000 మంది ఒకే చోటకు చేరుకోవాల్సి వస్తుందన్నారు. ఇది ప్రజలకు దూరం పెరగడమే కాకుండా ట్రాఫిక్ ఇబ్బందులు, వందల మంది ఒకే చోటుకు చేరే అవకాశం ఉంటుందన్నారు. అందుకే కార్యాలయాలను మరింత వికేంద్రీకరించాలే.. తప్పా.. కేంద్రీకరించకూడదన్నారు.
- ఇది మండలాలను కుదించి తాలుకాలుగా ఏర్పాటు చేయడం మాదిరి అవుతుందన్నారు.
- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రతి మండలంలో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న కారణంగా అక్కడే కార్యాలయాలు నిర్మించడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు డా. ఎస్.మల్లారెడ్డి, రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యుడు ప్రతాప్ తదితరులున్నారు.